కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు ధాత్రినాథ్ గౌడ్

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి బీఆర్ఎస్ నాయకులు ధాత్రీనాథ్ గౌడ్ బుధవారం వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలోని శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు నాగరాజు, గోపాల్, కేశవ్, బాబీ, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బస్తీవాసుల వినతి

రాయదుర్గం: నానక్‌రాంగూడ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ ఎస్సీ బస్తీవాసులు పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని బుధవారం కలిసి వినతిపత్రాన్ని స్థానికులు అందించారు. అనంతరం బస్తీలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను, కావాల్సిన అభివృద్ధి పనులపై ఆయనకు వారు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అన్ని రోడ్లను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. బస్తీవాసులు నరేష్, మహేందర్, యాదయ్య, చంద్రశేఖర్, రవి, కమలేష్, డి.రవి, రాజు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు



టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కేసీఆర్ ఫాంహౌస్‌లో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే 15 ఏళ్లు అధికారంలో ఉంటుందని.. కాంగ్రెస్ ప్రభుత్వ 6నెలల పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మళ్లీ అధికారం వారిదే అని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. దేవుడు దిగి వచ్చినా మళ్లీ కేసీఆర్ అధికారంలోకి రాడన్నారు. రూ.7లక్షల కోట్లు అప్పులు చేశారని మళ్లీ మీకు అధికారం ఇవ్వాలా అని ప్రశ్నించారు. తెలంగాణను డ్రగ్స్ రాష్ట్రంగా మార్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని ఆరోపించారు. వారం రోజుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ది ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్‌నేత, స్పోక్స్ పర్సన్ శ్రీకాంత్‌యాదవ్, సెక్రటరీ అల్లం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి.. మురుగు తిప్పలు

పట్టించుకోని అధికారులు • ఏళ్లు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు లేదు



మదీనాగూడ జాతీయ రహదారిపై ఏరులై పారుతున్న మురుగు నీరు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్ కమాన్ ఎదుట ఉన్న నాలా నుంచి మురుగు పొంగిపొర్లుతుంది. జాతీయ రహదారిపై మురుగు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాహనదారులు మురుగులో నుంచే పోతున్నారు. ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రులు ఉన్నాయి. రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలు దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. ఈర్ల



రామకృష్ణనగర్ ముఖద్వారం ఎదుట నాలా నుంచి పొంగుతున్న మురుగు నీరు



చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ జాతీయ రహదారి వరకు సుమారు రూ.15 కోట్లతో 2.4 కిలోమీటర్ల పొడవు నాలా పనులు పూర్తయ్యాయి. కానీ నాలా కల్వర్టులోకి ఈ మురుగు కాలువను కలపడంలో జాప్యం జరుగుతుండడంతో పలు కాలనీలవాసులకు, ఆసుపత్రులకు వచ్చే వారు మురుగులో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఈర్ల చెరువు నుంచి వైశాలీనగర్, వినాయకనగర్, మదీనాగూడ, రామకృష్ణనగర్ జాతీయ రహదారి వరకు సుమారు 2.4 కిలో మీటర్ల నాలా కల్వర్టును నిర్మించారు. ఇది దీప్తిశ్రీనగర్ నుంచి గంగారం పెద్ద చెరువులోకి కలుస్తుంది.
- నాలా కల్వర్టు పనులు పూర్తి అయినప్పటికి పొంగుతున్న నాలా కాలువను కల్వర్టులోకి కలపకపోవడంతో కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- జీహెచ్ఎంసీ అధికారులు మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏళ్ల తరబడి..



మదీనాగూడ రామకృష్ణనగర్ ముఖద్వారం వద్ద నాలా కాలువ నుంచి మురుగు నీరు పొంగుతోంది. సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే అధికారి కరువయ్యారు. ఇప్పటికైన అధికారులు పొంగుతున్న మురుగునీటి సమస్య పరిష్కరించాలి. – మల్లేష్, రామకృష్ణనగర్

కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించాలి



రామకృష్ణనగర్ కమాన్ ముందు నాలా కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పారిశుధ్య సిబ్బంది తొలగించి మురుగు నీరు సాఫీగా వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలి. రోడ్డుపై పారుతున్న మురుగు నీరు సమస్యను శాశ్వత పరిష్కారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి.

– రవి, మదీనాగూడ

'ప్రజాపాలన' సేవా కేంద్రాల ఏర్పాటు

ఉప కమిషనర్ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ –21 పరిధిలో ప్రజాపాలన దరఖాస్తుల సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఉపకమిషనర్ వంశీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ 21 పరిధిలో నాలుగు వార్డులు చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ ఉన్నాయన్నారు. వార్డు కార్యాలయంలో గురువారం నుంచి ప్రజాపాలన దరఖాస్తుల సేవా కేంద్రాలలో జీహెచ్ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రజాపాలన దరఖాస్తులలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్నా చేసుకోవచ్చన్నారు. తమకు సంబంధించిన వార్డు కార్యాలయంకు వెళ్ళి దరఖాస్తులలో నెలకొన్న సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాపాలన సేవా కేంద్రం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి వార్డుకు ఒక సేవా కేంద్రం ఉందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోగలరని డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు.

రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్: రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీసెస్), డాన్‌బాస్కో దిశ సంయుక్తంగా ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దిశా డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కోఆర్డినేటర్లు ఐవన్‌వాజ్, కార్తీక్, రంగారెడ్డి జిల్లా ఎన్‌సీఎస్ యువ అధికారి విజయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. హెటిరో, టెక్ మహీంద్రా, అపోలో హోమ్ హెల్త్‌కేర్, ఎంజీబీ మోటార్ అండ్ ఆటో ఏజెన్సీ, రిలయన్స్ డిజిటల్ వంటి దాదాపు 17 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని మరిన్ని వివరాలకు 94940 92219, 89771 75394 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అసాంఘిక శక్తులను కట్టడి చేయాలి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి అశేషంగా తరలివచ్చే భక్తులకు అసాంఘిక శక్తుల పట్ల ఇబ్బందులు తలెత్తకుండా వారిపై దృష్టి సారించాలని రాయల సేవా సమితి ప్రతినిధులు పోలీసులను కోరారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ.. భక్తుల చాటున అసాంఘిక శక్తులు యథేచ్ఛగా సంచరిస్తుంటారని మద్యం, డ్రగ్స్ మత్తులో గతేడాది సృష్టించిన బీభత్సంతో భక్తులతో పాటు చుట్టు పక్కల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. మత్తులో జోగుతున్న యువకులను కట్టడి చేసేందుకు దేవాలయ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రత్యేకంగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరగా పోలీసు అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. వినతి ఇచ్చిన వారిలో సభ్యులు అప్పాజి, ఆంజనేయులు, మధు, కిషోర్ ఉన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్య రంగ సమస్యల పరిష్కారం కోసం నేడు (4న) తలపెట్టిన విద్య సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ కోరారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, రూ.7100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల, వీసీల నియామకం, ప్రభుత్వ కాలేజీ, పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో బంద్‌కు పిలుపునిచ్చినట్లు వివరించారు.

సీపీఎం మద్దతు..

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ పరీక్ష అక్రమాల పై విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ ఆధ్వర్యంలో నేడు నిర్వహించతలపెట్టిన (4న) విద్య సంస్థల బంద్‌కు సీపీఎం మద్దతు ప్రకటించినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి పేర్కొన్నారు.

బ్రాహ్మణవాడీలో మర్రి శశిధర్‌రెడ్డి పర్యటన



సనత్‌నగర్: బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీలో బుధవారం ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి పర్యటించారు. జలమండలి అధికారులు డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ సమయంలో గోతులు తవ్వి వ్యర్థాలను తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మర్రి శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన అక్కడి నుంచే జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ చేయగా వారు అక్కడికి చేరుకున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తామని జలమండలి సిబ్బంది తెలిపారు. రెండు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జలమండలి జీఎం వినోద్, ప్రకాష్‌నగర్ సెక్షన్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ సంతోష్, నాయకులు మర్రి పురురవరెడ్డి, నెమలి ఆనంద్, మహేష్, అంజిబాబు, యాదగిరి, శ్రీనివాస్, రాంచందర్, మంగమ్మ, సత్తెమ్మ, సురేందర్‌రెడ్డి, గుంటి సత్యనారాయణ, విజయ్‌కుమార్, వికాస్, నరేష్, కిట్టు, పార్శి పరమేష్ పాల్గొన్నారు. కాగా.. వరద సాఫీగా పారేందుకు కూకట్‌పల్లి నాలా రిటైనింగ్ గోడకు మర్రి శశిధర్‌రెడ్డి సూచన మేరకు మున్సిపల్ అధికారులు వన్‌వే ఓపెన్ వాల్వ్‌ను అమర్చారు.

ఎట్టకేలకు మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని ఈడబ్ల్యూఎస్ 950 వద్ద తాగునీటి గేట్ వాల్వ్‌కు బుధవారం అధికారులు మ్యాన్‌హోల్ నిర్మాణం చేపట్టారు. రెండు నెలల నుంచి మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉండటంతో పాటు చెత్తాచెదారం, వర్షపు నీటితో నిండి ఉంది. దీంతో దోమలకు ఆవాసంగా మారటంతో బుధవారం 'సాక్షి'దిన పత్రికలో మరమ్మతులు సరే... మ్యాన్‌హోల్ నిర్మాణమెప్పుడు?'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్ నిర్మాణం చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



భరత్‌నగర్‌కాలనీలోని ఈడబ్ల్యూఎస్ 950 వద్ద మ్యాన్‌హోల్ నిర్మాణం చేపట్టిన సిబ్బంది

నేడు ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో 4వ తేదీ ఉదయం 9గంటలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు, డివిజన్ వాసులు పాల్గొని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చు.

కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కే.ముత్తుకు శుభాకాంక్షలు



మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు స్వీకరించిన కొత్తపల్లి ముత్తుని బుధవారం రెయిన్‌బోవిస్టాస్ రాక్ గార్డెన్ అసోసియేషన్ తరుపున అధ్యక్షుడు బండి మధుసూదన్ రెడ్డి, సంఘ సభ్యులు రామ్, ప్రమోద్‌రెడ్డి, ప్రసాద్, శ్రీపాద్, పూసపాటి దీప్తిలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మూసాపేట కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టి. సచిన్, అద్నాన్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

మోతీనగర్: హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని హిందూ వాహిని కూకట్‌పల్లి విభాగం ప్రతినిధులు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడినందుకు మంగళవారం రాత్రి శ్రీవివేకానందనగర్ చౌరస్తాలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ తీరు మార్చుకోకుంటే హిందూవాహిని ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నార్లపురం శ్రీనివాస్, గోనెల సుదర్శన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందూవాహిని ప్రతినిధులు

ప్లాస్టిక్ వాడక నిషేధంపై డ్రాయింగ్ పోటీలు

కూకట్‌పల్లి: అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ వాడక నిషేధ దినం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక, పికాసో–ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్‌నగర్ శాఖ ఏఆర్‌డీసీ పాఠశాలలో బుధవారం డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు జరిగాయి. 'పర్యావరణాన్ని పరిరక్షించండి, ప్లాస్టిక్ బ్యాగ్ వాడకాన్ని నిరోధించండి'అనే ఇతివృత్తంతో జరిగిన ఈ పోటీల్లో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మూడు విభాగాలుగా జరిగిన పోటీల్లో ఒక్కో విభాగానికి ముగ్గురు చొప్పున 12 మంది విజేతలుగా నిలిచారు.

- విజేతలకు జన విజ్ఞాన వేదిక, పికాసో–ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ తరపున సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేశారు. విజేతలు గీసిన చిత్రాలు చెకుముకి సైన్స్ మ్యాగజైన్‌లో ఆగస్టు సంచికలో ప్రచురితమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు చల్లా శ్రీనివాసరావు, స్వాతి, గణేష్, షాహిజ్, పికాసో ఆర్ట్స్ స్కూల్ హెడ్ రమేష్ బాబు, ఎస్ఆర్‌డీజీ సర్దార్ పటేల్‌నగర్ శాఖ ప్రిన్సిపాల్ రాధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి



రసూల్‌పురా: విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. టివోలి రోడ్‌లోని బోల్టన్ పాఠశాల్లో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాలలకు ఆటోలలో వెళ్లే విద్యార్థులు ఐదుగురి కన్నా ఎక్కువగా ఎక్కరాదని ఆటో డ్రైవర్లు తాగి ఉంటే అలాంటి ఆటోలో వెళ్లరాదని స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు ఆటోలపై నిఘా ఉంచాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు బాధ్యులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషిణి రావు, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రీ దేవి, చంద్రశేఖర్, క్యాంపస్ ఇన్‌చార్జి వరప్రసాద్ అనితేష్ పాల్గొన్నారు.

జెడ్పీ ఉనికి ప్రశ్నార్థకం

- నేటితో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం
- జీహెచ్ఎంసీలో గ్రామాల విలీనం ప్రచారంతో జెడ్పీ ఉనికి ప్రశ్నార్థకం
- ఓఆర్ఆర్ లోపలి పురపాలికలు, జీపీలన్నీ బల్దియాలోకే..



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులో ఐదు మండలాలతో ఐదేళ్ల కిందట ఆవిర్భవించిన మేడ్చల్ జిల్లా పరిషత్(జెడ్పీ) ఉనికి ప్రశ్నార్థకమైంది. నేటితో జెడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగియనుంది. ఓఆర్ఆర్ లోపలి నగర శివారు గ్రామాలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయన్న ప్రచారంతో మేడ్చల్ జెడ్పీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గురువారంతో జిల్లా, మండల పరిషత్ చైర్మన్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చివరి సారిగా మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితోసహా జెడ్పీ సభ్యులంతా .... కొత్త జిల్లాల ఆవిర్భావంలో భాగంగా అతి తక్కువగా ఐదు రూరల్ మండలాల(61 గ్రామ పంచాయతీలు)తో ఏర్పడిన మేడ్చల్ జెడ్పీ ఇక మీదట ఉండకపోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నగర శివారుల్లో(ఓఆర్ఆర్ లోపలి)ని గ్రామ పంచాయతీలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కావచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ దిశగా సన్నాహాలు చేస్తోందని, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా పేర్కొనటాన్ని పరిశీలిస్తే, మేడ్చల్ జెడ్పీ భవిష్యత్‌లో ఉండకపోవచ్చని తెలుస్తోంది.

జిల్లాలో విలీనం కానున్న పంచాయతీలివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో ఓఆర్ఆర్ లోపల కాచవాని సింగారం, కొర్రెముల, ప్రతాప సింగారం, చీర్యాల, గోధుమకుంట, కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి, యాద్గారపల్లి, గౌడవెల్లి, పూడూరు, బొమ్మరాసిపేట తదితర 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇవి కాకుండా ఓఆర్ఆర్‌కు అతి సమీపంలో మరో 10 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. శివారుల్లోని దాదాపు 20 పైగా గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీలో విలీనం అయితే, మిగిలిన 40 గ్రామ పంచాయతీలతో మేడ్చల్ జిల్లా పరిషత్ కొనసాగించటం సాధ్యం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పురపాలికల విలీనంపైనా చర్చ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఓఆర్ఆర్ లోపల ఉన్న గ్రామ పంచాయతీలే కాకుండా, పురపాలక సంఘాలు కూడా జీహెచ్ఎంసీలో విలీనం కానున్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. కొత్తగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భవించిన తర్వాత నూతనంగా ఏర్పడిన బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లతోసహా దమ్మాయిగూడ,నాగారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, పోచారం పురపాలికలు కూడా జీహెచ్ఎంసీలో విలీనం కావచ్చునన్న ప్రచారం జరుగుతోంది. జిల్లాలో మొత్తంగా 13 పురపాలక సంఘాలు ఉండగా, ఒక మేడ్చల్ మినహాయించి, మిగతా 12 పురపాలక సంఘాలన్నీ గ్రేటర్‌లో కలుస్తాయన్న చర్చ సాగుతోంది.

మండల ,జిల్లా పరిషత్‌ల్లో ఇక ప్రత్యేక పాలనే..!

నగర శివారుల్లోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలోని మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం గురువారం ముగియనుండటంతో ఇక ప్రత్యేక పాలన కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మండల, జిల్లా పరిషత్‌లకు స్పెషల్ ఆఫీసర్లను త్వరలో నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. శివారల్లోని ఇద్దరు జెడ్పీ చైర్మన్లు ఉండగా, వీరిద్దరు కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో మొత్తంగా 42 మండలాలు(రంగారెడ్డిలో 27, మేడ్చల్‌లో 15 మండలాలు) ఉండగా, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్న మండలాలు 26(రంగారెడ్డి 21, మేడ్చల్ 5 మండలాలు) మాత్రమే ఉన్నాయి.

బీసీ జనగణన చేపట్టిన తర్వాతే..

బీసీ కుల జనగణన చేపట్టి ఆ తర్వాత గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. గతంలో ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ చట్టం రూపొందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరముంది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై ప్రభుత్వం అక్టోబరు వరకు వేచి చూసే ధోరణితో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఆరు గ్యారంటీలు అందని వారికి న్యాయం చేస్తాం

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని శంషీగూడ వార్డు కార్యాలయాన్ని బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో వార్డు కార్యాలయ కార్యకలాపాల గురించి చర్చించారు. విద్యుత్, గ్యాస్‌లకు సంబంధించిన పథకాల లబ్ధి కోసం ప్రజలు ఎక్కువగా వస్తున్నారని అన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు, దరఖాస్తు చేసుకున్నా లబ్ధిపొందని వారు నిత్యం వార్డు కార్యాలయానికి వస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆరు గ్యారంటీలకు లబ్ధి పొందని వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆపరేటర్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.



శంషీగూడ వార్డు కార్యాలయాన్ని సందర్శిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఓయూకు గ్రూప్–4 ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికై అభ్యర్థులు ఓయూకు రానున్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది వర్సిటీలో సేవలకు 375 మంది గ్రూప్–4 ఉద్యోగులను టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రభుత్వం ఓయూకు ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఓయూకు ఉద్యోగాలను ఎంపిక చేయడం 107 ఏళ్ల యూనివర్సిటీ చరిత్రలో ఇదే ప్రథమం. గతంలో వైస్ చాన్సలర్ నాన్ టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిబంధనలు మార్చి టీఎస్‌పీఎస్సీ ద్వారా ఓయూకు ఉద్యోగాలను నియమించారు. ఇదిలా ఉండగా ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయనే ఆశతో గత 27సంవత్సరాల నుంచి తక్కువ వేతనానికి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పర్మనెంట్ లక్ష్యం నెరవేరదు. కనీసం టైం స్కేల్ ఉద్యోగులను కూడా పర్మనెంట్ చేసే అవకాశాలు కనిపించడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపును అందుకొని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పోరాడిన ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులకు నేడు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ పార్టీ కూడా మోసం చేస్తున్న తరుణంలో ఉద్యోగాల పర్మనెంట్ కోసం గతంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేసిన కాంట్రాక్టు సిబ్బంది మరో పోరాటానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఆ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, డొనేషన్లను వసూలు చేసేందుకు సిండికేటుగా ఏర్పడిన ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌పీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వలిగొండ నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉన్నత విద్య మండలి సెక్రెటరీ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల నిర్వాహకుల ధనదాహానికి ప్రతిభగల పేద విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను చదవలేని దుస్థితి ఏర్పడిందన్నారు. అడ్మిషన్ల ప్రక్రియకు ముందే అడ్డదారిలో సీట్లు విక్రయిస్తున్న కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor ,Door No.31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A.190/2021

BETWEEN:
Central Bank of India, Benz Circle Branch, Vijayawada ...Applicant Bank
AND:
M/S. Lakshmi FFF Enterprises, Nidodavole and others ...Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To,
D-1: M/s. Lakshmi FFF Enterprises, Rep by its prop. Smt. Kancharla Naga Subdhadra Lakshmi, W/o. Venkata Rao D.no. 5-3-203, Samisra Gudem, Nidadavole, Tanuku-534301, West Godavari District, Andhra Pradesh.
D-2: Smt. Kancharla Naga Subdhadra Lakshmi W/o. Venkata Rao, Prop of M/s. Lakshmi FFF Enterprises, Flat No. 202, Surya Deep Residency, Near Bhaskar Model School, Hyder Nagar Kukatpally, Hyderabad-500085, Telangana state.
D-3: Bannuru Ram Krishna, S/o. Late Venkat Rao, R/o. Door No. 87-1-43, Opp Gokulam Road Near Kamala Vari Dhaba, Ashok Nagar Kakinada, East Godavari District, Andhra Pradesh.
Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1 to 3) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs.
1. You are hereby summoned to appear and file written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal or **15-07-2024** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader/Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determine in your absence.
Given under my hand and seal of the Tribunal on this the day of 12th June 2024 At Visakhapatnam.

Signature of the Officer Authorised
Debts Recovery Tribunal,Visakhapatnam